క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

అయిజ: మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 10:30 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాయి ప్రకాష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు హాజరవుతారని తెలిపారు. సంబంధిత సభ్యులు హాజరు కావాలని కోరారు. అదేవిధంగా అన్ని శాఖల మండల స్థాయి అధికారులు సంబంధిత నివేదికలతో హాజరు కావాలని కోరారు.

ఆరోగ్య మహిళా కార్యక్రమం

మానవపాడు: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డాక్టర్ రిజ్వానా తాన్విర్ ఆధ్వర్యంలో ఆరోగ్య మహిళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉండవెల్లి, బొంకూర్, అమరవాయి గ్రామాల మహిళలకు వైద్య పరీక్షల నిర్వహించారు. రక్తహీనత, షుగర్, క్యాన్సర్ తదితర ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సత్యానారాయణ, చంద్రన్న, సిబ్బంది పాల్గొన్నారు.

కబ్జాకు గురవుతున్న రోడ్డు



అయిజ: మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీ సమీపంలో అంతర్గత రోడ్లు రోజురోజుకు కబ్జాకు గురవుతున్నాయి. దాని వల్ల రోడ్లు ఇరుకుగా మారి వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా టీచర్స్ కాలనీ నుంచి మండలంలోని ఉత్తనూరు గ్రామానికి వెళ్లేదారిని కొందరు వ్యక్తులు కబ్జా చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కబ్జా చేసిన వారిపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారి పనులు పూర్తయ్యేదెప్పుడో?



శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ నుంచి రాజోళి శివారు వరకు నూతన రోడ్డు నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంకర వేసి బీటీ వేయకపోవడంతో వాహనదారులు తరచు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయమై పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు స్పందించి రోడ్డు పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రయాణికులకు ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

ఖేలో ఇండియాకు వనపర్తి విద్యార్థి ఎంపిక

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని మాస్టర్ మైండ్స్ హై స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న జి.రుద్ర ఢిల్లీలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 24, 25, 26వ తేదీల్లో కొనసాగనున్న కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో పోటీ చేయనుందని, పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.గౌతంకుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో రుద్రను ప్రిన్సిపాల్ గౌతమ్‌కుమార్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

'సకాలంలో లోన్లు చెల్లించకుంటె నష్టం'

వీపనగండ్ల: బ్యాంకులో లోన్లు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించకుంటే నష్టపోతారని ఇండియన్ ఓవర్‌సిస్ బ్యాంక్ మేనేజర్ రవీంద్రబాబు సూచించారు. గతంలో తమ బ్యాంకు ద్వారా పంట రుణాలు తీసుకున్న 2,800 రైతులకు రుణమాఫీ జరిగిందని, పలు కారణాలతో 578 రైతులకు రుణమాఫీ జరగలేదని అన్నారు. రుణమాఫీ జాబితాలో పేర్లు వచ్చిన మరో 1,300 రైతులు తమ రుణ ఖాతాలను రెన్యూవల్ చేసుకోలేదని, దీంతో రైతులకు నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొందని సూచించారు. పైపులైన్ రుణాల కోసం తమ బ్యాంక్ నుంచి రుణాలు తీసుకున్న రైతులు రూ.6 కోట్లు, ముద్ర లోన్ల ద్వారా రూ.1.42 కోట్లు, దీర్ఘకాలికంగా బకాయి పడ్డారని, అలాంటి వారికి ఉన్నత స్థాయి బ్యాంక్ అధికారుల ఆదేశానుసారం వన్‌టైం సెటిల్‌మెంట్ చేసి రుణ విముక్తులను చేస్తామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

పెబ్బేరు రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యం విక్రయించాలని జెడ్పీటీసీ పద్మ కోరారు. మంగళవారం మండలంలోని సూగూరులో ఐకేపీ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, నరసింహ, పెద్దింటి వెంకటేష్, నాగరాజు, మహిళా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమస్యలు తీరేనా?

- మరమ్మతుకు నోచుకోని గదులు
- మండలంలో 11 పాఠశాలలు ఎంపిక
- మన ఊరు మనబడిలో పూర్తి కాని పనులు



అలంపూర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మరమ్మతుకు నోచుకోని గదులు

అలంపూర్ రూరల్: ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నా, పురోగతికి నోచుకోవడం లేదు. మండల విద్యాశాఖలో రెండు క్లస్టర్ పాఠశాలల సముదాయంలో అలంపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాల క్యాతూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలున్నాయి. మొత్తం 34 పాఠశాలల్లో 19 ప్రాథమిక పాఠశాలలు, ఐదు ప్రాథమికోన్నత పాఠశాలలు, ఏడు ఉన్నత పాఠశాలలు, 1 కేజీవీబీ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ఉపాధ్యాయుల పోస్టులు మొత్తం 81 మంది గాను 70 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. 11 ఉపాధ్యాయ పోస్టులు కలిగా ఉన్నాయి. ఇందులో 2023–24 విద్యా సంవత్సరానికి విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో బాలురు 3,101 మంది, బాలికలు 2,442 మంది మొత్తం 5,543 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. సర్కారు బడులలో విద్యార్థుల సామర్థ్యం పెంపొందించేందుకు అనేక రకాల ఏర్పాట్లు చేస్తున్నా ప్రయోజనం లేకపోలేదు. మండలంలోని 34 పాఠశాలలకు గాను 11 పాఠశాలలను మన ఊరు–మనబడి, మనబడి– మన బస్తీకి ఎంపిక చేశారు. ఇందులో 8 పాఠశాలల్లో పనులు నేటికీ పూర్తి కాలేదు. ఇంకా కొంత మేర పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. పూర్తి చేసేందుకు నెలలు గడుస్తున్న కాంట్రాక్టర్లు పూర్తి చేయడం లేదు. జడ్పీహెచ్ఎస్(హరిజనవాడ), అలంపూర్ , జడ్పీజీహెచ్ఎస్ అలంపూర్, జడ్పీహెచ్ఎస్ క్యాతూరు 3 పాఠశాలకు ఇంతవరకు టెండర్లు కాలేదు. టెండర్లకు ఎవరు సముఖత చూపడంలేదు. సర్కారు బడులు పురాతనమైనవి కావడంతో గదుల శిథిలావస్థకు చేరాయి. దశాబ్దాల చరిత్ర కలిగిన అలంపూర్ క్లస్టర్ పాఠశాలలో 2 గదులు పూర్తిగా కూలిపోయాయి. ఇంతవరకు అవిమరమ్మతులకు నోచుకోలేదు. మండలంలోని క్యాతూర్, బుక్కాపూరం, అలంపూర్ జడ్పీహెచ్ఎస్ న్యూప్లాట్స్, పీఎస్ న్యూప్లాట్స్, సుల్తాన్‌పూర్, పాఠశాలలోని గదులు మరమ్మతులకు నోచుకోలేదు. సాయంత్రం కాగానే మందుబాబులు పాఠశాలలోకి వచ్చి మద్యంతాగి అక్కడే సీసాలు వేసి వెళ్తున్నారని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలంపూర్ న్యూప్లాట్స్‌లోని జడ్పీహెచ్ఎస్, పీఎస్ పాఠశాలల దగ్గర మద్యం దుకాణాలు ఉండడంతో పాఠశాలల ఆవరణలో మద్యం తాగుతున్నట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు.



బుక్కాపూర్‌లో శిథిలమైన గది తలుపులు

80శాతం పనులు పూర్తి..



మన ఊరు–మన బడి, మన బడి–మనబస్తీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 11 పాఠశాలలు ఎంపిక అయ్యాయి. వాటిలో 8 పాఠశాలలు 80 శాతం పనులు పూర్తి అయ్యాయి. మిగిలిన ముడింటింటికి టెండర్లు కాలేదు. టెండర్లకు ఎవరు ముందుకు రావడంలేదు. పూర్తి స్థాయిలో సర్కార్ బడులు పురోగతి చెందే దిశగా ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తున్నాయి.

– అశోక్‌కుమార్, మండల విద్యాధికారి

మంత్రి జూపల్లికి ఘనస్వాగతం



మంత్రి జూపల్లికి స్వాగతం పలుకుతున్న నేతలు

గద్వాల రూరల్: మంత్రిగా బాధ్యతలు స్వీకరించి మంగళవారం తొలిసారిగా జిల్లాకు విచ్చేసిన పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు జెడ్పీ చైర్‌పర్సన్ సరిత ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. గద్వాల మండలం అనంతపురం వద్ద మంత్రికి గజమాలతో సన్మానం చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారుల సమీక్ష అనంతరం ఆయన నేరుగా జెడ్పీ చైర్‌పర్సన్ ఇంటికి వెళ్లారు. అక్కడ పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు మంత్రిని పూల మాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన హైదరాబాద్‌కు తిరిగి వెళ్లారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, బండ్ల రాజశేఖర్‌రెడ్డి, తిరుపతయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో గద్వాల సమీపంలో 700మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చారని, గత ప్రభుత్వంలో ఉన్న నాయకులు బలవంతంగా వారి వద్ద నుంచి ఇళ్ల స్థలాలు లాక్కుని రోడ్డున పడేశారని సీనియర్ సిటిజన్ ఫోరం నాయకులు మోహన్‌రావు మంత్రి జూపల్లికి వివరించారు. దీనిపై బాధితులకు న్యాయం చేయాలని హైకోర్టు ఉత్తర్వులు స్పష్టంగా ఉన్నప్పటికీ వారికి ఎలాంటి న్యాయం జరగలేదని, నిరాశ్రయులైన 700మందిని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరారు. ఈ మేరకు మంత్రికి వినతి పత్రం అందజేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు మోహన్‌రావు తెలిపారు.

అయ్యప్పస్వామి పూజలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే



పూజలో ఎమ్మెల్సీ చల్లా, ఎమ్మెల్యే విజేయుడు

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలోని శివాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో మహాపడి పూజను నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసనమండలి ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే విజయుడు హాజరై అయ్యప్ప స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట నాయకులు సుదర్శన్‌రెడ్డి, కృష్ణసాగర్, రఘున్న, రాజు, కృష్ణ, ఉన్నారు.

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలోని న్యూప్లాట్స్ కాలనీలో కన్నెస్వామి విజయ్ ఇంట్లో అయ్యప్పస్వామి పడిపూజ మంగళవారం ఘనంగా నిర్వహించారు. గురు స్వాములు లక్ష్మీనారాయణ, ఎల్లయ్య, రఘు స్వామి ఆధ్వర్యంలో మాల ధరించిన అయ్యప్ప స్వాములు భజనలు నిర్వహించారు. అయ్యప్ప నామస్మరణతో ఆ ప్రాంతం పులకించింది. అయ్యప్ప స్వామి 18 మెట్లను పూలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మాలధరించిన అయ్యప్ప స్వాములు శ్యామ్, కృష్ణ, రాము, విశ్వాస్, గణనాథ, నవీన్, రంగ, శ్రీనివాసులు, భాస్కర్ గౌడ్ తదితర స్వాములు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: మెరుగైన వైద్యం కోసం సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయ న తన నివాసంలో గద్వాలటౌన్‌కు చెందిన సఫీ నాబేగానికి రూ.60వేలు, కేటీదొడ్డి మండలం ఈర్లబండకు చెందిన చిన్ననర్సింహులుకు రూ.48వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రమేష్‌నాయుడు, కౌన్సిలర్ దొలు, మధు, ధర్మనాయుడు, అజయ్ పాల్గొన్నారు.

ఏఎస్ఐ మృతి తీరనిలోటు



గద్వాలక్రైం: ఏఎస్ఐ అయ్యన్న మృతి తీరని లోటు అని ఏఎస్పీ రవి అన్నారు. మంగళవారం ఇటిక్యాల ఏఎస్ఐ ప్రజలకు అన్ని విధాలుగా సేవలు అందించారన్నారు. కొన్ని సంవత్సరాలుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్‌లో ఉత్తమ సేవలు అందించారన్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియలకు రూ.25 వేలు అందజేశారు. పోలీస్ సంక్షేమ విభాగం నుంచి రూ.30వేలు అందజేశారు. డీఎస్పీలు వెంకటేశ్వర్లు, ఇమ్మానీయేలు, ఎస్ఐ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలి



సమ్మె చేస్తున్న తపాలా జీడీఎస్ ఉద్యోగులు

గద్వాల అర్బన్: గ్రామీణ డాక్ సేవక్ ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలని ఏఐజీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మన్న, కార్యదర్శి రవీందర్‌లు కోరారు. తమ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కేంద్రంలోని తపాలా కార్యాలయం వద్ద నిరవధి సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8గంటల పనితో పాటు పెన్షన్, ప్రయోజనాలను కల్పించాలని, సీనియర్ జీడీఎస్, ఉద్యోగులకు 12–36ఏళ్ల సర్వీస్కు అదనపు ఇంక్రిమెంట్, ఆర్థిక ఉన్నతి, వైద్య సదుపాయం కల్పించాలని, గ్రూప్ ఇన్సురెన్స్ రూ.5లక్షలకు పెంచాలని, తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. సమ్మెలో ఆర్గనైజింగ్ సెక్రటరి శివనంద్, ట్రెజరరీ మద్దిలేటి, ఇస్మాయిల్, ఉస్మాన్, విశ్వనాథం ఉన్నారు.

మున్సిపాలిటీలో పడకేసిన పారిశుద్ధ్యం



పశువుల ఆస్పత్రి ఆవరణలో వంతెనపై పారుతున్న మురుగు

అయిజ: మున్సిపాలిటీ కేంద్రంలో కొన్ని సంవత్సరాల నుంచి పారిశుద్ధ్యం పనులు చేపట్టకపోవడంతో పట్టణం మురికికూపంగా మారింది. గతంలో నిర్మించిన మురుగు కాల్వలు అనేక చోట్ల శిథిలమయ్యాయి. డ్రెయినేజీల్లో పూడికను తీయక పోవడంతో కాల్వల్లో మురుగు నిండి రోడ్లపై పారుతోంది. మురుగు కాల్వల్లో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. పట్టణంలో దుర్వాసన వెదజల్లుతోంది. దోమల ఉధృతి పెరిగి ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. రోడ్లపై మురుగు పారుతుంటే ప్రజలు నడువలేని దుస్థితులు నెలకొన్నాయి. కమతం పేటలో మురుగుకాల్వలో పూడిక తీయకపోవడంతో నిండిపోయాయి. దుర్గానగర్‌లోని అనేక వీధుల్లో ఇంతవరకు డ్రెయినేజీలు నిర్మించలేదు. పశువుల ఆస్పత్రివద్ద వంతెనకు రెండువైపుల చెత్తదిబ్బలు పేరుకుపోయాయి. డ్రెయినేజీల్లో పూడిక నిండిపోయి మురుగునీరు రోడ్లపై పారుతోంది. వర్షాకాలంలో వంతెన దాటేందుకు ప్రజలు ఇబ్బందిపడుతుంటారు. పారిశుద్ధ్యం పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు టీడీ వ్యాక్సిన్



అలంపూర్ రూరల్: కస్తూర్బా పాఠశాల విద్యార్థినీలకు మంగళవారం టీడీ వ్యాక్సిన్‌ను క్యాతూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వేశారు. విద్యార్థినీల వ్యక్తిగత పరిశుభ్రత, టీబీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఏ బాలీశ్వరయ్య శెట్టి, ఎస్ఓ కృష్ణవేణి, ఏఎన్ఎం గుల్నార్ భాను, కామేశ్వరి, ఆశా కార్యకర్త ప్రమీల పాల్గొన్నారు.

ఆలూర్‌లో వైద్య శిబిరం



ఆలూర్‌లో వైద్య శిబిరం నిర్వహించిన వైద్యులు

గట్టు: మండలంలోని ఆలూర్‌లో మంగళవారం ఎస్‌బీఐ ఫౌండేషన్, భౌష్యభారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వైద శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో మొకాలు, నడుము నొప్పి, బీపీ, షుగర్, చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరంలో అవసరమైన వారికి రక్త నమూనా సేకరించారు. 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు మల్లమ్మ, వైద్యాధికారి రాజశేఖర్, తిమ్మప్ప, శ్రీనివాస్‌రెడ్డి, సునీల్, సిబ్బంది ఉన్నారు.

గ్రంథాలయ భవనం నిర్మించండి



శిథిలావస్థకు చేరిన గ్రంథాలయ భవనం

అయిజ: గతంలో మండల కేంద్రంలో నిర్మించిన గ్రంథాలయ భవనం శిథిలమై అనేక సంవత్సరాలైంది. మూడేళ్ల క్రితం గ్రంథాలయ భవనం తడిసి ముద్దయ్యింది. వర్షానికి తడిసిన వస్తువులు పనికి రాకుండా పోయాయి. విలువైన పుస్తకాలు కుళ్లి పోయాయి. దాని వల్ల గ్రంథాలయ భవనం ఖాళీచేసి కొత్త బస్టాండ్ పరిసర ప్రాంతంలో అద్దె భవనంలో గ్రంథాలయ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శిథిలమైన భవనం కూల్చివేసి ఆ స్థానంలో నూతన భవనం నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు మండల విద్యుత్‌శాఖ ఏఈ వెంకట్‌రావ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బీచుపల్లి సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తుండడంతో మండలంలోని బీచుపల్లి, ఎర్రవల్లి, కొండేరు, జింకలపల్లి, యాక్తాపురం, కొండపేట గ్రామాలకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు, రైతులు గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

పాఠశాల గేటు బయటే పడిగాపులు!



గేటుముందు విద్యార్థులు, ఉపాధ్యాయులు

గట్టు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ప్రధాన గేటుకు వేసిన తాళం ఉదయం 9:30 గంటలైనా తీయకపోవడంతో మంగళవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు చాలాసేపు పాఠశాల బయటే నిలబడాల్సి వచ్చింది. రోజూ తాళం తీసే అటెండర్ సెలవు పెట్టడంతో తాళాలు అదే పాఠశాల ఉపాధ్యాయుడికి అప్పగించాడు. తాళాలు తీసుకున్న ఉపాధ్యాయుడు ఆలస్యంగా రావడంతో ఆయన వచ్చాకే ప్రధాన గేటు తెరవాల్సి వచ్చింది. ఆలస్యంగా గేటు తాళం తీయడంతో ప్రార్థన ఆలస్యంగా నిర్వహించినట్లు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తెలిపారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు



వెంకటాపురం లక్ష్మీవేంకటేశ్వర కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



పెద్ద చింతరేవుల ఆలయంలో భక్తుల రద్దీ



ఆదిశిలా క్షేత్రంలో..

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అమావాస్యను పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సద్దలోనిపల్లి కృష్ణస్వామి, పాల్వాయి అడవిఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదిశిలా క్షేత్రంలో భక్తులకు అంజనేయులు హరికథ నిర్వహించారు.

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలో పాగుంట లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసి రథోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు, మానవపాడు, అమరవాయి, పెద్దఆముదాలపాడు, కలుకుంట్ల, పెద్దపోతులపాడు, జల్లాపురం, బోరవెల్లి గ్రామాలలో మంగళవారం అమావాస్య పూజలు నిర్వహించారు. ఆలయాల్లో ఆంజనేయస్వామికి ఆకుపూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ధరూరు: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంతో పాటు పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి ఆలయం, అల్వలపాడు తెలుగోనిపల్లి ఆంజనేయస్వామి, కోతులగిద్ద అరణ్యేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరై పూజలు చేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

ఉండవెల్లి: మండలంలోని డి.బూడిదపాడు, అలంపూర్ చౌరస్తా, బైరాపురం గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల్లో అమవాస్య పూజలు నిర్వహించారు. డి.బూడిదపాడులో స్వామికి అభిషేకం నిర్వహించి ఆకుపూజ చేశారు. బుక్కాపురం, క్యాతూరులో అన్నదానం నిర్వహించారు.

గట్టు: మండల కేంద్రంలోని గండి ఆంజనేయస్వామి ఆలయంలో పంచామృత అభిషేకం నిర్వహించారు. మాచర్లలోని చెన్నకేశవస్వామి వారికి పూజలు నిర్వహించారు.

అయిజ: మండల కేంద్రంలో, వివిధ గ్రామాల్లో భక్తులు శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుంత రామలింగేశ్వర, మిట్ట రామ లింగేశ్వరస్వామి ఆలయాల్లో అభిషేకాలు, పల్లకీ సేవలు నిర్వహించారు.



కోతులగిద్ద అరణ్యేశ్వర స్వామి ఆలయంలో అన్నదానం



కుర్వపల్లిలో శివ పార్వతుల కళ్యాణం



డి.బూడిదపాడు ఆలయంలో పల్లకీసేవలో భక్తులు

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోండి

అయిజ: ప్రభుత్వం 2023లో యాసంగి సీజన్‌కు అందించే రైతుబంధు కోసం నూతనంగా పాస్ పుస్తకాలు వచ్చిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శంకర్‌లాల్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. బుధవారం మండలంలోని ఆయా గ్రామాల వద్ద నిర్మించిన రైతువేదిక భవనాల్లో రైతులు సంబంధిత ఏఈఓలను కలిసి దరఖాస్తు పత్రాలు అందజేయాలని కోరారు. దరఖాస్తు ఫారంతో పాటు పంటపాలం పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డ్, బ్యాంక్ అకౌంట్ బుక్ జిరాక్స్ పేపర్లు ఏఈఓలకు అందజేయాలని సూచించారు.